పర్యావరణ ప్రేమికులు

- పర్యావరణ పరిరక్షణకు జేడీ ఫౌండేషన్ విశేష కృషి
- ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంతో విత్తన బంతుల తయారీ
- పొలం బడి ద్వారా ఆకుకూరల సాగు


మల్కాపురం కేవీ స్కూల్‌లో పొలంబడిలో పాల్గొన్న విద్యార్థులు


గోపాలపట్నం హైస్కూల్‌లో పొలంబడిలో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం: వారి లక్ష్యం కాస్త వినూత్నం.. చెట్లు, పక్షులు, మొక్కలు, మనము కలసి పరస్పర సహకారంతో ఆరోగ్యంగా బతుకుదామన్నదే వారి నినాదం.. సమాజంలో పర్యావరణ హితం కోసం శ్రద్ధ వహిద్దామన్నదే వారి హితవు.. ఇది ప్రజల గొంతుల్లో, చేతుల్లో చూడాలని ఆశిస్తున్నారు.. జేడీ ఫౌండేషన్ గోపాలపట్నం బ్రాంచి సభ్యులు. ఔత్సాహికులు, పర్యావరణ ప్రేమికుల సహాయ సహకారాలతో పలు రకాల కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. గోపాలపట్నం బ్రాంచి 2019లో ప్రారంభించిన నాటి నుంచి పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.


పక్షులకు దాహార్తిని తీర్చే ఏర్పాటులో జేడీ ఫౌండేషన్ సభ్యులు

పొలంబడి

విద్యార్థుల్లో వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలాలు అందుబాటులో లేని పట్టణ ప్రాంతాల్లో పాఠశాల ఆవరణలో కాయగూరలు పెంచి వాటి ఫలసాయం పొందేలా చేశారు. ఇలా చాలా పాఠశాలల్లో విజయవంతంగా పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇలా విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తి, అవగాహన కల్పిస్తున్నారు.

విత్తన బంతుల తయారీ

విత్తన బంతులు ఏవిధంగా తయారు చేస్తారు.. అవి ఎలా మొక్కలుగా పెరుగుతాయన్న అంశాలపై పలు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలతో బంతులు తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వర్షా కాలంలో కొండవాలు, మైదాన ప్రాంతాల్లో విసురుతారు. ఈ ప్రక్రియ ప్రతి ఏటా సాగుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ సంచుల స్థానంలో గుడ్డ సంచుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. తరచూ గుడ్డ సంచులను పంపిణీ కూడా చేస్తున్నారు.

దీంట్లో రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేస్తున్నారు. దోమల నివారణకు ఆయిల్ బంతులు వేయడం వల్ల ఏవిధంగా దోమలు నివారణ అవుతాయో స్థానికులకు వివరించడం, అలాగే దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం చేస్తున్నారు. మొక్కలు నాడడం వల్ల పర్యావరణ సమతుల్యత ఉంటుందని వివరిస్తూ

ఎకో బ్రిక్స్

ప్లాస్టిక్ సీసాలు బయట పారేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. అలా చేయకుండా వాటితో ఎకో బ్రిక్స్ తయారు చేస్తున్నారు. అందులో భాగంగా డ్రింక్ సీసాలతో స్టూల్ స్టాపర్లు, స్పీచ్ డయాస్ వంటివి తయారు చేస్తున్నారు. ఖాళీ బాటిల్‌లో వ్యర్థాలు, కాగితాలు వేసి గట్టిగా దట్టిస్తారు. వాటిని అనుకున్న రూపంలో పేర్చి తాళ్లతో కట్టి గమ్‌లతో అతికిస్తారు. ఆ విధంగా తిరిగి ఉపయోగించేలా పలు రకాల వస్తువులు తయారు చేస్తూ అవసరమైన వారికి అందిస్తున్నారు. దీని వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని జేడీ ఫౌండేషన్ సభ్యులు చెబుతున్నారు.


ఎకో బ్రిక్స్‌తో తయారు చేసిన స్టూల్


ప్రతి పుట్టిన రోజుకు ఒక మొక్క పెంపకం

మొక్కల పెంపకంపై ఆసక్తిని పెంచుతున్నారు. వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చడం కోసం గోపాలపట్నం, ఎన్‌హెచ్ జాతీయ రహదారి, తదితర ప్రాంతాల్లో చెట్లకు కుండీలు ఏర్పాటు చేసి నీరు పోస్తున్నారు. ఇది వారికి నిత్యకృత్యంగా మారింది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో మొక్కలు నాటి అక్కడి వారికే సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు.

ఆరోగ్యకర వాతావరణాన్ని భావితరాలకు అందిద్దాం..



భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కోసం కృషి చేద్దాం. పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల్ని స్వయంగా నిషేధించాలి. దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, నిషేధిత ప్లాస్టిక్ సంచుల్ని వాడకపోవడం, పేపర్ టీగ్లాసులు వల్ల కేన్సర్ భారిన పడే అవకాశాలు ఉన్నయన్న విషయాలు పలువురికి చెప్పాలి.

– సాలాది సలాది శ్రీరామకృష్ణయ్య, జేడీ ఫౌండేషన్ విశాఖ కన్వీనర్, కొత్తపాలెం ఆదర్శనగర్

అందరిలో చైతన్యం రావాలి



పర్యావరణ పరిరక్షణపై అందరిలో చైతన్యం రావాలి. జేడీ ఫౌండేషన్ కార్యక్రమాలు చాలా బాగున్నాయి. అందుకే సభ్యుడిగా చేరాను. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. మొక్కలు నాటుదాం అన్న నినాదాన్ని ప్రతి చోట వినిపిస్తున్నాం.

– మంత్రి వెంకటరావు, జేడీ ఫౌండేషన్ సభ్యుడు, యల్లపువానిపాలెం

కార్మిక నాయకుడు మోహన్‌కుమార్‌కు ఘన నివాళి


మోహన్‌కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మల్కాపురం: కార్మికుల జీవితాలలో వెలుగులు నింపిన నేత దివంగత డాక్టర్ మోహన్‌కుమార్ అని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, కార్మిక నాయకుడు బద్రినాథ్, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మూర్తి అన్నారు. డాక్టర్ మోహన్‌కుమార్ 5వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆయిల్ లారీ అసోసియేషన్ కార్యాలయం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించడమే కాకుండా, వారికి అవసరమైన మందులు అందించిన గొప్ప వ్యక్తి మోహన్‌కుమార్ అని కొనియాడారు. మరోవైపు కార్మిక నేతగా ఐఎన్‌టీయూసీలో కీలక బాధ్యతలు చేపట్టి, ఎంతో మంది కార్మికుల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు కె.ఈశ్వరరావు, ఆంధ్రా మోటార్స్ ట్యాంక్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ


రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మట్టా శశి ప్రియాంక

కంచరపాలెం: జాతీయ క్షయ నిర్మూలనలో భాగంగా జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి ఆర్పీపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీబీ వారోత్సవాలను శుక్రవారం హెల్త్ సెంటర్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా శశి ప్రియాంక ప్రారంభించారు. ఈ మేరకు నేషనల్ అల్యూనియం కార్పొరేషన్ లిమిటెడ్ (నాల్కో) సహాయంతో గుర్తించిన టీబీ రోగులకు ఆమె కంది పప్పు, పప్పుచెక్కిలు, పలుకలు, ప్రోటిన్ పౌడర్, ఆయిల్ ప్యాకెట్లు, రాగిపిండి, గోధుమ పిండి, తదితర పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగ సిబ్బంది హెచ్ఎస్ సూర్యానారాయణ, ఎస్‌టీఎల్‌ఎస్ శరత్, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు, ఎల్‌టీ పూర్ణిమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యర్థాల తొలగింపు


మల్కాపురం సేవా మార్గం వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనక గల మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది శుక్రవారం తొలగించారు. స్థానికంగా ఉంటున్న కొంత మంది నిర్లక్ష్యంగా సేవా మార్గంలో వ్యర్థాలను పడేశారు. దీంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించి పూడిక తొలిగించేలా చర్యలు తీసుకున్నారు.

పారిశుధ్య కార్మికురాలు పోలమ్మకు సత్కారం


పోలమ్మను సత్కరిస్తున్న కార్పొరేటర్ లావణ్య, తదితరులు

మల్కాపురం: పారిశుధ్య కార్మికురాలిగా 35 ఏళ్లుగా సేవలు అందిస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన పోలమ్మను 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఘనంగా సత్కరించారు. గుల్లలపాలెంలోని కార్పొరేటర్ కార్యాలయంలో పోలమ్మకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందించి అభినందించారు. 35 ఏళ్లుగా పారిశుధ్య కార్మికురాలిగా అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 61వ వార్డు అధ్యక్షుడు వాసు, లాయర్ రాజు, గులిగిందల కృష్ణ, సాల్మన్‌రాజు, పిలక రమణ, కోటా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని కూలిన కల్యాణ మండపం రక్షణ గోడ


పడిపోయిన కల్యాణ మండపం గోడ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం రక్షణ గోడ శుక్రవారం మధ్యాహ్నం కూలిపోయింది. మండపంలో సాయంత్రం ఓ శుభకార్యం ఏర్పాట్లలో భాగంగా అలంకరణ సామగ్రిని తీసుకొస్తున్న ఆటో ఈ గోడను ఢీకొట్టడంతో కూలిపోయిందని నిర్వాహకులు చెబుతున్నారు. గోడ కూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో అక్కడ ఉన్న క్యాటరింగ్ సిబ్బంది శుభకార్యం చేసుకుంటున్న వారు భయాందోళన చెందారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా నెట్‌బాల్ జూనియర్ జట్ల (బాలురు, బాలికలు) ఎంపిక శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీరు మహంకాళి తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన బాలురు, బాలికలకు ఈనెల 1వ తేదీకి 19 ఏళ్లు నిండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు జెరాక్స్‌తోపాటు స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 8న రావులపాలెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొడానికి అర్హులని చెప్పారు.

7న చలో హైదరాబాద్

సీతంపేట: ఎస్సీ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్రాలు వర్గీకరణ చేయాల్సి ఉందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చివరి దశకు వచ్చిందని, వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. ఎమ్మార్పీస్ అధ్యక్షుడు అంజూరి దీపక్, ఎంఎస్‌పీ అధ్యక్షుడు కింతాడ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం, మండపారాధనలు చేశారు. అలాగే మహాగణపతి, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మీ, వాసవీ మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి,కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, పచ్చికోళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట


క్రయ విక్రయదారులతో కిటకిటలాడుతున్న అక్కయ్యపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సీతంపేట: ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో పాత రేట్లతో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి శుక్రవారం క్రయ విక్రయ దారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బారులు దీరారు. దీంతో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిటలాడింది. శనివారం నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు కానుండడంతో స్థలాలు, అపార్టుమెంట్ ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారితో రద్దీ నెలకొంది. ద్వారకానగర్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 10 నుంచి 15 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ చార్జీలు కొంత వరకైనా తగ్గుతాయని క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. రాత్రి ఏడు గంటల వరకు కార్యాలయ సిబ్బంది పని చేసి కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

సారె.. అదిరె


పూజలందుకున్న దుర్గా భవాని


సారె ఊరేగిస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సూదికొండపై వెలసిన దుర్గా భవానీ అమ్మవారి ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగానిర్వహించారు. ఆలయ ధర్మకర్త బళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ముందుగా అమ్మవారి సారెను భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, కరణం లక్ష్మి అప్పారావు, నక్కా రమణబాబు, వంకర రాము, కె.దశేంద్ర, టి.వెంకటరావు, బి.సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

4న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాల నియామకాలకు స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీలలో కెమిస్ట్రీ సబ్జెక్టుగా 60 శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్‌లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న గాయని నాగజగదీశ్వరి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ అలరించింది. గాయని వి.నాగ జగదీశ్వరి ఆలపించిన అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి, మునిపల్లి కీర్తనలు ప్రేక్షకులను రంజింపజేశాయి. వాతాపి గణపతిం భజే, వాసుదేవయని, మాయామేత, పరాకేల సరస్వతి, నారదగాన, మామవ సదా, తిల్లానా కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై శ్రీరామ్ శ్రీనివాస్, మృదంగంపై తాలాడ చైతన్య వాయిద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కళాకారులను సత్కరించారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన అవసరం

సీతంపేట: నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ' మానవ వనరుల వినియోగం– అభివృద్ధిలో కృత్రిమ మేధస్సు పాత్ర'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌డీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.ఎస్.ఠాగూర్ మాట్లాడుతూ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కృత్రిమ మేధస్సు గురించి ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. చాప్టర్ ప్రెసిడెంట్ కె.వి.రావు మాట్లాడుతూ సంస్థలు కూడా ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకునేలా సహకారం అందిస్తున్నాయని తెలిపారు. పలు సంస్థల మానవ వనరుల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సంస్థ కార్యదర్శి వి.భాస్కర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ సాంబశివరావు, భగవతిరావు, కృష్ణకుమార్, ఎస్.సుధాకర్, నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా కుంచుమాంబ, దుర్గమాంబ పరస


భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి


అమ్మవారిని దర్శించుకుంటున్న బద్రినాథ్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్‌లో కొలువుదీరిన కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరస శుక్రవారం ఘనంగా జరిగింది. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పారిశ్రామిక ప్రాంత నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు అసౌకర్యానికి కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మందిరం వద్ద స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి పాల్గొని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్


మాట్లాడుతున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

మర్రిపాలెం: మద్యం మత్తులో ఏటీఎంలో నగదు అపహరించడానికి యత్నించిన వ్యక్తిని కంచరపాలెం క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. 50వ వార్డు మాధవధార ప్రధానరహదారిలోని ఎస్‌బీఐ ఏటీఎంలో గురువారం వేకువ జామున మాధవధార ప్రాంతానికి చెందిన పైడి సంతోష్ నగదు చోరీ చేయడానికి ప్రయత్నించాడు. ఏటీఎం మెషీన్ డోర్ తెరిచే క్రమంలో ముంబయ్‌లోని ప్రధాన కార్యాలయానికి సందేశం వెళ్లడంతో వారు వెంటనే నగర సీపీ శంఖబ్రత బాగ్చికి సమాచారం ఇచ్చారు. వెంటనే సీపీ కంచరపాలెం క్రైం పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో క్రైం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే నిందితుడు సంతోష్‌కుమార్ అక్కడ నుంచి పరారయ్యాడు. సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టి 24 గంటల వ్యవధిలోనే అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా సంతోష్ కుమార్‌పై ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు ఉన్నట్టు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని వారు అభినందించారు. సమావేశంలో సీఐ ఎన్.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు సూర్యనారాయణ,సుదర్శనరావు పాల్గొన్నారు.

నడక పోటీలు రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 2వ తేదీన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడక పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకర్ త్రిపుర సుందరరావు జ్ఞాపకార్థం ఆరోజు ఉదయం 7 గంటలకు వాకర్స్ పార్కులో పోటీలు నిర్వహిస్తామన్నారు. 35–50 ఏళ్లు, 51–60, 61–70, 71 సంవత్సరాలు పైబడిన వారికి ప్రత్యేక విభాగాలుగా పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 7659804633, 9491292369 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

'తప్పెటగుళ్లు మా గుండె చప్పుడు'


తప్పెటగుళ్లు కళాకారుల ప్రదర్శన

సీతంపేట: అంతరించి పోతున్న తప్పెటగుళ్ల కళను భావితరాలు ఆదరించేలా లఘు చిత్రాన్ని నిర్మించి ప్రోత్సహించడం అభినందనీయని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. డ్రీమ్ షెల్టర్స్ కోళా రవి శంకరరావు నిర్మించిన ' తప్పెటగుళ్లు మా గుండె చప్పుడు' లఘు చిత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు కళపై అవగాహన కలిగేలా మంచి ఇతివృత్తంతో 20 నిమిషాల నిడివిగల లఘు చిత్రం నిర్మించిన కోలా రవిశంకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆర్లి తప్పెటగుళ్ల కళకారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, దర్శకుడు పి.సి.ఆదిత్య, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.